# కర్నూలు | నంద్యాల వార్త

20 సెప్టెంబర్ , 2023 బుధవారం పేజీలు 4


## కొనసాగిన ఎస్సై అభ్యర్థుల పరీక్షలు

**కర్నూలు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త :** పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ లో 18 వ రోజు దేహదారుడ్య పరీక్షలు జరిగాయి. ఈ దేహదారుడ్య సామర్థ్య పరీక్షలను కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ పర్యవేక్షించారు. ఈ రోజు 800 మంది అభ్యర్దులకు గాను 922 మంది అభ్యర్దులు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్ష లో 844 మంది అభ్యర్థులులో 717 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగు పరీక్షలో మంది 717 అభ్యర్థులులో 473 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. లాంగ్ జంప్ లో 717 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 541 మంది అభ్య ర్థులు అర్హత సాధించారు. ఎస్సై మెయిన్స్ పరీక్షకు ఈరోజు 578మంది అర్హత సాధించారు.

**అప్పీలు చేసుకున్న ఎస్సై అభ్యర్థులు హాజరు**



**కావాలి :** పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్ కు సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు బెటాలియన్ లో 2023 ఆగష్టు 25 వ తేది నుండి దేహదారుడ్య పరీక్షలు జరుగుతున్నాయి. ఎవరైనా సమస్యల పై అప్పీల్ చేసుకుని, రిక్విజేసేన్ లెటర్ రాసి ఇచ్చిన పురుష అభ్యర్దులు మరియు మహిళా అభ్యర్దులు కూడా సెప్టెంబర్ 21 వ (గురువారం) తేదిన అప్పీలుకు హాజరు కాగలరని కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆగష్టు 25 వ తేది నుండి ఇప్పటి వరకు దేహదారుడ్య పరీక్షలకు హాజరు కాని ఎస్సై అభ్యర్దులు సెప్టెంబర్ 20 వ తేదిన హాజరు కావచ్చు. సెప్టెంబర్ 4 వ తేదిన వర్షం కారణంగా రాని పురుష అభ్యర్దలు మరియు అప్పీలు చేసుకున్న పురుషులు మరియు మహిళ అభ్యర్దులు కూడా సెప్టెంబర్ 21 వ తేదిన హాజరు కాగలరు. సెప్టెంబర్ 5 వ తేది వర్షం కారణంగా రాని ఎస్సై అభ్యర్దులు సెప్టెంబర్ 22 తేదిన హాజరు కాగలరని కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్ తెలిపారు.




- రైతులకు మేలు జరిగింది అంటే అది మాతోనే సాధ్యం
- జనాలను 'ముంచి' మళ్ళీ గద్దెనెక్కాలని బాబు, పవన్‌లు
- 77 చెరువులకు నీటిని నింపి రైతు గుండెల్లో శాశ్విత స్థానం
- జరిగే అభివృద్ధితో రాయల కాలం గుర్తొస్తుందన్న మంత్రి బుగ్గన



# నాడు నాన్న.. నేడు నేను..!



**డోన్, ప్రభాతవార్త :**

తమది రైతు పక్షపాతి కుటుంబమని నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు ముఖ్యమంత్రి హోదాలో తాను సీమప్రాంతానికి ఎనలేని అభివృద్ధిని చేసామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంచేసారు. కరువుతో అల్లాడిపోయే సీమకు హంద్రీనీవా ప్రాజెక్టును తీసుకవచ్చి పంటపొలాలను నాడు దివంగత వైఎస్ సస్యశ్యామలం చేస్తే నేడు 77 చెరువులను నింపుతూ రైతు కళ్ళల్లో ఆనందాన్ని చేస్తున్నానని వైఎస్ చెప్పారు. చంద్రబాబునాయుడుకు కేవలం ఎన్నికలప్పుడు ఓట్లకోసం జనాలను బురిడీ కొట్టేంచేందుకు కొత్తకొత్త పథకాల పేర్లు ప్రవేశపెడ్తూ, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తుంటాడని దుయ్యబట్టారు. ఆయన చేసే దోపిడీ, నిజస్వరూపాని దాచిపెట్టేందుకు ఎల్లో మీడియాతోపాటు తోడుగా దత్తపుత్రుడు పవన్‌లు ప్రాకులాడుతుండటాన్ని మనం గమనించామని వైఎస్ విమర్శలు గుప్పించారు. కేవలం సిఎం మాత్రమే మారారని అదే బడ్జెట్ అదే పాలన వుంటుందని అయితే తాము మాత్రం అక్కచెల్లెమ్మలకు, అవ్వతాతలకు, విద్యార్థులకు ఎన్నో ఫలాలను నేరుగా బ్యాంకుల్లోకి నగదును ఇచ్చే మేలును చేస్తున్నామా లేదాయని ప్రశ్నిస్తూ మరి ఇంత మేలును చంద్రబాబు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఆయనకు కేవలం దోచుకోవడమే కావాల్సిందని జనాలకు మేలు చేయాలన్న తలంపు ఏమాత్రం వుండదన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని దాదాపు వందగ్రామాలకు మేలు చేకూర్చేలా 77 చెరువులకు నీళ్లు నింపే బృహత్తర పథకాన్ని క్రిష్ణగిరి మండలంలోని లక్కసాగరంలో సిఎం జగన్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం డోన్ పట్టణంలో రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి బుగ్గన రాజారెడ్డి సారథ్యంలో తరంగంలా తరలివచ్చిన అశేషజనవాహినీ మధ్య జరిగిన బహిరంగసభలో సిఎం ప్రసంగించారు.


• వివరాలు 2లో


## అసలు ఏం జరిగింది..?

- నింధితులపై కేసు నమోదు అయ్యిందా..?
- మరో వ్యక్తిని తప్పించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఆరోపణ..
- మొత్తానికి ఫోక్సో చట్టం కేసు ఒకరిపై నమోదైంది..



సమాజంలో రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. అత్యాచారాలకు అడ్డుకట్ట వేసి నింధితులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం 2012లో ఫోక్సో చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చిన అత్యాచారాలు మాత్రం తగ్గటం లేదు. వివరాల్లోకి వెళితే ..

**ఆదోని రూరల్,సెప్టెంబరు 19,ప్రభాతవార్త** మండల పరిధిలోని ఒక గ్రామంలో ఒక వ్యక్తి పోలీస్ వ్యవస్థలో ఉన్న ఓ కానిస్టేబుల్ అత్యాచారంలో ఉన్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్ వ్యవస్థలో ఉన్న వ్యక్తి కావడంతో పోలీస్ అధికారులు ఆ పోలీసును తప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. భాదితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఒకరి వైపు ఫోక్స్ కింద వ్యక్తిపై కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు.

**అంతా ఒట్టి మాటలే : ఎస్ఐ పీరయ్య**

అత్యాచారంలో ఒక పోలీసు ఉన్నాడన్న మాట ఒట్టి ఆరోపణలు అని పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## ఉదయించే సూర్యుడిలా.. చంద్రబాబు తిరిగి మనముందుకు వస్తారు

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 19, ప్రభాతవార్తః** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును చేధించుకొని ఉదయించే సూర్యుడిలా తిరిగి మన ముందుకు వస్తారని తెలుగుదేశం బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై నాగేశ్వర్ యాదవ్ పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తు బాబు ఆరోగ్యం బాగుండాలని, త్వరగా బయటకు రావాలని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్, ఎమ్మెల్సీ, కర్నూలు పార్లమెంట టిడిపి అధ్యక్షులు బిటి నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు బిసి జనార్ధన్‌రెడ్డి, గౌరు చరితారెడ్డి, మీనాక్షి నాయుడు, మంత్రాలయం, కర్నూలు ఇంచార్జీలు తిక్కారెడ్డి, టీజి భరత్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డోన్ ఇంచార్జీ సుబ్బారెడ్డి, నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రాంపుల్లయ్యయాదవ్, నరసింహులుయాదవ్ టిడిపి సీనియర్ నాయకులు వెంకటరాముడు, మహిళా నాయకురాలు పార్వతమ్మ, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వై నాగేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడుపై శమంతకమణి దొంగలించాడనే అభియోగాన్ని విఘ్నేశ్వరుడి పూజ మహిమ ద్వారా ఆయన ఎలా బయటపడ్డారో అందరికి తెలిసిందే కలియుగంలో నేడు చంద్రబాబు నాయుడిపై పడిన నీలాపనింద కూడ అలాంటిదే. ఈ అపవాద నుండి నిర్దోషిగా దృష్టపరిపాలకుల కుట్రల నుండి బయటకు రావాలని ఆభగవంతున్ని వేడుకుందాం. రాజకీయ ప్రతీకారంతోనే చంద్రబాబు నాయుడును కేసులోకి లాగార న్నారు. గవర్నర్ అనుమతిలేకుండా నారా చంద్రబాబును అరెస్టు చేయడం దుర్మార్గ మన్నారు. తప్పుడు కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందుతున్న ఈ సైకో ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పరిపాలించే అర్హత వైసీపీ నాయకులు కోల్పోయారన్నారు. తొందరలో ప్రజలంతా కలిసి ప్రజాక్షేత్రంలో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.



## ముఖ్యమంత్రికి.. ఘనస్వాగతం..!



**నంద్యాల, సెప్టెంబరు 19, ప్రభాతవార్తః** నంద్యాల జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో 77 చెరువులకు జలకళ కార్య క్రమం ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి నంద్యాలజిల్లా మంత్రులు, నాయకులు అధికారులు ఘనస్వాగతం పలికారు. 11.30 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకుచేరుకున్న వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. డోన్ బహిరంగసభ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికినవారిలో జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్, జిల్లా ఇంచార్జ్ మంత్రి అంజద్‌బాషా, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టరు టి రాహుల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, నీటిపారుదల కార్యదర్శి గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఎమ్మెల్యేలు శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తోగూరు అర్థర్, గంగుల బిజేంద్రరారెడ్డి, ప్రభుత్వ మైనార్టీ సలహాదారు హాబిబుల్లా, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పిపి నాగిరెడ్డి, కెడిసిసి బా ్యంకు ఛైర్మన్ విజయ మనోహరి తదితరులు ఘనస్వాగతం పలి కారు. డోన్ పట్టణా నికి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల, బేతంచెర్లలో ఎంఎంఈ పార్కు ఏర్పాటు కావాలని ప్రజలు కోరారు.



## చంద్రబాబు నాయుడు త్వరగా విడుదల కావాలని పూజలు

**: బుగ్గ రామేశ్వరస్వామికి పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యేలు,టీడీపీ నాయకులు**



**బనగానపల్లెరూరల్,సెప్టెంబర్19,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షులు,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్షేమంగా,ఆరోగ్యంగా ఉండాలని మరియు వారు అక్రమ కేసు నుండి త్వరగా జైలు నుండి విడుదల కావాలని కోరుతూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి,ఉమ్మడి జిల్లాల టీడీపీ నేతలు మంగళవారం పాణ్యం నియోజకవర్గంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గ రామేశ్వరస్వామి దేవాలయం నందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారికి టెంకాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు 45ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క కేసు కూడా లేకుండా ఉమ్మడి రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారని, ప్రత్యేక ఆంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారని వారు గుర్తు చేశారు. అలాంటి నాయకుడిని ఈ వైసీపీ ప్రభుత్వం కేవలం టీడీపీకి వస్తున్న ప్రజాదరణ అదే విధంగా యువగళానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడాని చూసి ఓర్వలేక వారి వెన్నులో వణుకుపుట్టిందని వారు తెలిపారు. ఇప్పటికైనా వైసీపీ పెద్దలు నారా చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి,ఎన్ఎండి ఫరూక్,గౌరు వెంకటరెడ్డి,మల్లెల రాజశేఖర్ గౌడ్,టీజీ భరత్ తదితరులు ఉన్నారు.

## గుడిసె దగ్ధం..

**- 40 గొర్రెలు, రెండు వృషభాలు మృతి**



**కౌతాళం, సెప్టెంబర్19, ప్రభాతవార్త ;** మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో గుడిసె దగ్ధమై 40 గొర్రెలు, రెండు వృషభాలు మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కౌతాళం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో కురువ వెంకటేష్, మహాదేవప్ప అనే రైతు ఊరి చివరన తన పొలం పక్కన ఉన్న స్థలంలో వృషభాలు, గొర్రెలకు షెడ్ వేసుకున్నాడు. పూరి గుడిసెలో ప్రతిరోజులాగే ఎద్దులకు దోమలు కుట్టకుండా గడ్డివాముకి పొగ పెట్టి వెళ్లాడు. అయితే పూరి గుడిసెలోని ఆవిరి బయట వెళ్లకుండా ఉండడంతో నిప్పు రాసుకుని పూరి గుడిసె కాలిపోయి ఉండొచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు. జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి బాధితా రైతును ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

**బనగానపల్లె, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నందు మంగళవారం అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నిట్టూరు రాజశేఖర్, కిట్లు, కుమార్, జాన్సన్, సురేష్, హరి, రవి, విజయ్, యోహాన్, వేణు, జాను, ఇసాక్‌లకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసీపీ కండువాకప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రామపురం గ్రామ వైసీపీ నాయకులు వీర వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, కంబగిరి, రామారావు, ప్రమోద్, వలి, మాదిగ కంబగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఫోటో తెచ్చిన తంటా..!

- పోలీస్‌స్టేషన్ ఆవరణలో వ్యక్తిపై దాడి
- పోలీస్‌స్టేషన్ ఆవరణలో కుప్పలికూన వడ్డే శ్రీనివాసులు... ఆస్పత్రికి తరలింపు





**మిడుతూరు, సెప్టెంబర్19, ప్రభాతవార్త ;** సరదాగా నూతన వినాయక విగ్రహం వద్ద ఇద్దరు ఫోటో దిగారు. అదే ఫోటోను ఒక సామాజిక వర్గానికి చెందిన వాట్సప్ గ్రూపులో సంఘంలో జతపరిచారు. వాట్సాప్ గ్రూపులో ఆ ఫోటోను జత పరచడంపై అదే సంఘంలోని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు.


2లో


## ఎలుగుబంటి సంచారం..!

**మహానంది, సెప్టెంబరు 19, ప్రభాతవార్తః** మహానంది సమీపంలోని ఈశ్వర్‌నగర్ కాలనీ యందు ఎలుగుబంటి సంచారం చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. గత రెండురోజులుగా అటవీప్రాంతం నుంచి పార్వతీపురంలోకి ఎలుగుబంటి వేకువజామున రావడంతో స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో పారిపోయింది. మళ్లీ సాయంత్రం పార్వతీపురం కాలనీలోనే కనిపించడంతో కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే మహానంది ప్రజలు గ్రామాల్లోకి ఎలుగుబంటి సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ఫారెస్టు అధికారులను కోరుతున్నారు.






## చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి



**హొళగుంద,సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడును వెంటనే విడుదల చేయాలని టిడిపి మండల కన్వినర్ డాక్టర్ తిప్పయ్య అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు నుండి నిర్దోషిగా బయటకు రావాలని మంగళవారం శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయంలో సిద్దేశ్వర స్వామికి 101టెంకాయలు కొట్టి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వినర్ డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి ప్రతిపక్ష నాయకుల మీద పడి ఏ తప్పు చేయకున్నా కనీసం ఎఫ్ఐఆర్‌లో పేరు లేకున్నా చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసే ప్రతి పనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఇలాంటివి అంబేద్కర్ రాజ్యాంగంలో ఉన్నాయా..లేక రాజారెడ్డి రాజ్యాంగంలో ఉన్నాయా..అని ఎద్దేవ చేశారు. సైకో జగన్ ప్రభుత్వం చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి రాజమండ్రి కేంద్రకారాగారంలో ఉంచారని తక్షణమే బాబును విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు గాదిలింగ, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆదాం,యువ నాయకుడు మోయిన్,ఐటిడిపి మండల అధ్యక్షులు నాగేంద్ర,కార్యదర్శి హనుమంతు, టిఎన్ఎస్ఎఫ్ మల్లి,తిక్క స్వామి, జంగల్ రామాంజి,సురేష్,చంద్ర,కోగిలతోట రఘు,మల్లయ్య,పెద్దతిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి భాధ్యత



**ఆదోని రూరల్,సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రత మనందరి భాధ్యత అని సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ,వైకాపా నాయకులు అల్లమ్మ గారి పురుషోత్తం రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ ఆద్వర్యంలో గ్రామంలోని వీధులలో కార్మికుల చేత దగ్గరుండి పారిశుధ్య పనులు చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత కోసం గ్రామస్తుల సహకారం కూడా కావాలన్నారు. గ్రామం శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కావున ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

## చంద్రబాబు కోసం సంగమేశ్వరంలో పూజలు



**కొత్తపల్లి,సెప్టెంబర్ 19,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రికి ఆయురారోగ్యాలు కలిగించి అక్రమ కేసుల నుండి బయటిరావాలని కోరుతు తెలుగదేశం పార్టీ నాయకులు సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు జెడ్.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంధర్బంగా నాయకులు మాట్లాడుతు రాష్ట్రాభివృద్ధి కోసం పాటు పడిన చంద్రబాబుపై రాజకీయ కచ్చతో జగన్‌మోహన్‌రెడ్డి పోలీసుల అండతో అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం దారుణమని ఎన్ని కేసులు పెట్టిన బాబు బయటి వస్తాడని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ లింగస్వామిగౌడ్, మండల నాయకులు మధుసూధన్‌రెడ్డి, శివారెడ్డి, నాగశేషులు, హోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు అభినందనీయం



**నంద్యాల హాస్పటల్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** గతంలో రాష్టంలో పాలించిన పాలకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఒకటే ఉండేదని ముఖ్యమంత్రిగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజనులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటుచేసి వారికి అన్నివిధాలుగా అందవలసిన సంక్షేమ పథకాలు అందడం మంచి పథకాలని బిలావత్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. నంద్యాల కర్నూలు జిల్లాల ఉమ్మడి వైయస్ఆర్‌సీపీ జోనల్ ఇంచార్జీగా తనకు ఇచ్చిన పదవిని తాను శాయశక్తుల పార్టీకి ఉపయోగపడేలా పనిచేస్తానని పేర్కొన్నారు. గతంలో పార్టీకి ఉపయోగపడేలా పనిచేసిందుకు జగనన్న ఐప్యాడ్ టీమ్ సభ్యులు ఇచ్చిన ప్రశంస పత్రాన్ని మంగళవారం నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం జరిగిందనానరు. గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించడంలో వైసీపీ పార్టీ ముందు ఉందన్నారు. రాష్టంలో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి గెలువడం ఖాయమన్నారు. జిల్లాలోనే కాకుండా రాష్టంలోని గిరిజనులందరిని ఏకం చేసి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవడానికి కృషిచేస్తానని శంకర్ నాయక్ పేర్కొన్నారు.

## రాజకీయ కక్ష్యతోనే బాబును అక్రమ కేసులో ఇరికించారు



**ఆలూరు,సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ కక్ష్యతోనే తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేయించారని ఆలూరు తాలుక తెదేపా యువ నాయకులు రఘుప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆలూరు టిడిపి ఇంచార్జ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో నియోజకవర్గ టిడిపి మైనార్టీ నాయకులు పెద్దఎత్తున రిలేనిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. చంద్రబాబును వెంటనే విడుదల కావాలని దీక్షా శిబిరంలో ప్రత్యేక నమాజు(ప్రార్ధన) కూడా చేశారు. ఈ సందర్బంగా రఘుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సైకో జగన్ అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉంచారని తక్షణమే బాబును విడుదల చేయాలన్నారు. రానున్న 2024ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం నిమ్మరసం తీసుకుని దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ అశోక్‌యాదవ్,వాల్మీకి జిల్లా నాయకులు భాస్కర్‌నాయుడు, మణేకుర్తి వెంకటేష్,జిల్లా ఎస్‌సి సెల్ నాయకులు నరసప్ప,మైనార్టీ నాయకులు ఆదాం,హొళగుంద మైనార్టీ నాయకులు గజ్జహళ్లి బాబుసాబ్,ఆలూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి తెదేపా నాయకులు,కార్యకర్తలు,వివిధ హోదాల్లో ఉన్న టిడిపి మైనార్టీ నాయకులు,తెలుగు యువత,ఐటిడిపి, టిఎన్ఎస్ఎఫ్,టిఎన్‌టియుసి, మైనార్టీ నాయకులు,నందమూరి అభిమానులు,టిడిపి యూత్,కోట్ల యూత్ నాయకులు,తెదేపా అనుబంధ సంఘాల మైనార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**పగిడ్యాల, సెప్టంబరు 19,ప్రభాతవార్త :** వినాయచవితి పండుగను పురస్కరించుకుని పగిడ్యాల మండలంలో వీధివీధిన వినాయకుడి విగ్రహాలను ప్రతిష్టించారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వినాయకుడికి కాయకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండల పరిధిలోని నెహ్రూనగర్, కొత్త ముచ్చుమర్రి, పాత ముచ్చుమర్రి,అంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, తూర్పు ప్రాతకోట, ఎం.గణపురం, ఎన్.గణపురం గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. నెహ్రూనగర్‌లో నంద్యాల జిల్లా టీడీపి జిల్లా కార్యదర్శి బండి రమణమ్మ, టిడీపి నాయకులు బండి జయరాజు, ప్రజలువినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. పగిడ్యాలలో జెడ్పీటీసి పుల్యాల నాగిరెడ్డి, జెడ్పీటీసి పుల్యాల దివ్య, లక్ష్మాపురంలో నంద్యాల పార్లమెంటు టీడీపి యువనాయకులు మద్దిలేటి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి గోవిందు, శశిగౌడు, వైకాపా నాయకులు భూషిగౌడు, ప్రాతకోటలో డాక్టర్ నాగశేషులు, శ్రీనివాసులు నాయుడు, మదు,బాబు.అదేవిధంగా అయాగ్రామాల ప్రజలు వినాయకులకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పగిడ్యాల మండలంలో 70 వినాయకుడి విగ్రహాలను అయా గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు. మంగళవానంఎస్ఐ మాట్లాడుతూ ఆయాగ్రామాల ప్రజలు భక్తిశ్రద్దలతో బుధవారం సాయత్రం వినాయకుడి విగ్రహాలను నిమజ్జన్నం చేయాలనీ, ఈనేథ్యంలో మధ్యసేవించి వినాయకుల విగ్రహాల ఊరేగింపులో ఇబ్బంది కల్గించరాదన్నారు. అదేవిధంగా ఊరేగింపులో చిన్నపిల్లలను దూరంగా వుండేవిధంగా సూచుకోవడంతోపాటు డీజేలు ఉపయోగించరాదనీ,భక్తిశ్రద్దలతో వినాయకులను నిమజ్జన్నం చేయాలనీ వినాయకుల విగ్రహాల కమిటీ సభ్యులకు ఆయా గ్రామాలకుచెందిన ప్రజలకు ఎస్ఐ నాగార్జున సూచించారు.

## కష్టమర్లే బ్యాంకులకు దేవుళ్లు



**ఆదోనిలీగల్, సెప్టెంబర్19, ప్రభాతవార్త ;** బ్యాంకులకు వచ్చే కష్టమర్లే ఆయా బ్యాంకులకు దేవుళ్లని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎన్.వి.విజయమనోహరి అన్నారు. సోమవారం జిల్ల సహకార కేంద్ర బ్యాంకు సహకారంతో ఆదోనిలో ఎస్కేడీ కాలనీలో నూతన బ్రాంచిని ప్రారంభించారు. బ్యాంకును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాల్స్ననరు. ఐసీడీపీ ఫేస్-2 కింద రూ.85 లక్షల ఖర్చుతో ఈ నూతన కేడీసీసీ బ్రాంచిని నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే నూతన ఏటీఎం సెంటర్‌ను ప్రారంభించి బ్యాంకు ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం బ్రాంచి మేనేజర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, కమర్షియల్ క్రాఫ్ట్ లోన్స్ తమ బ్యాంకు ద్వారా పొందవచ్చున్నారు. రూ.18 కోట్లు డిపాజిట్లు ఉన్నాయన్నారు. రైతాంగానికి ఒక ఎకరా విట్ భూమికి రూ.2 లక్షలు, డ్రై ల్యాండ్‌కు రూ.1.50 లక్షలు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సొసైటీ ద్వారా క్రాఫ్ట్ లోన్ రూ.3 లక్షల వరకు ఇస్తున్నట్లు తెఇపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ డా.మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ శాంత, వైసీపీ సీనియర్ నాయకులు చంద్రకాంతరెడ్డి, నరసింహమూర్తి, కేడీసీసీ బ్యాంకు సీఈఓ రామాంజనేయులు, డీజీఎం నాగిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ వసంతకుమార్, ఐసీడీపీ ప్రాజెక్టు అధికారి వెంకటకృష్ణ, ఆస్కాబ్ జీఎం విజయకుమార్, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడాది కావస్తున్న జిల్లాల పేరు మార్చలేదు



**వెలుగోడు,సెప్టెంబర్ 19,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా ఏర్పడి ఏడాది కావస్తున్న పట్టణంలోని ప్రభుత్వ యోగ మరియు నేచురోపతి వైద్యశాల బోర్డు మీద నంద్యాల బదులు ఇంకా కర్నూలు అని ఉండడంతో పలువురు ఆశ్యర్యం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో 30 పడకల ఆస్పత్రిగా మారే ఈ భవనాన్ని ఇటీవలే జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంధర్శించి వెళ్ళారు. పరిపాలన అంత ఇక్కడి నుండే జరుగుతున్న అధికారులు జిల్లా పేరు మార్చక పోవడం విశేషం.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

**-నేడు వినాయక నిమర్జనం -నిమర్జనప్రాంతంలో భారీ ఏర్పాట్లు**



**వెలుగోడు,సెప్టెంబరు19,ప్రభాతవార్త :** వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం వినాయక చవితి వేడుక ప్రజలు, భక్తులు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయా ప్రాంతాలలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారు. అయా విగ్రహా మండపాల వద్ద విద్యుత్ దీపాలతో అంగరంగవైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట ప్రసాద్ మాట్లాడుతూ వెలుగోడు పట్టణంలో 35 విగ్రహాలు, బోయరేవులలో 2, మోతుకూరులో 1, వేల్పనూరులో 4, రేగడగూడూరులో 4, అబ్దుల్లాపురంలో2, గుంతకందాలలో3, తిమ్మనపల్లెలో1, మాధవరంలో 3 ఇలా మొత్తం 55 విగ్రహాల అనుమతులు తీసుకోవడం జరిగిందన్నారు. పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో నిమర్జనం బుధవారం నిర్వహిస్తున్నట్లు అయన వివరించారు. విగ్రహా ఏర్పాటు కమిటీ సభ్యులు పోలీసు కేటాయించిన సమయంలో తమ వాహనాలలో విగ్రహాలు తీసుకోని బయలుదేరి పోలీసు వారికి సహకరించాలని కోరారు. వినాయక నిమర్జన ప్రాంత వద్ద ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని అక్కడ చిన్న పిల్లలకు వెళ్ళకుడదని కమిటీ సభ్యులకు తెలియజేయడం జరిగిందన్నారు. చీకటి పడకముందే అన్ని విగ్రహాలు నిమర్జన ప్రాంతానికి చేరేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదు..

**:-నిరహార దీక్షలకు వికలాంగులు సంఘీభావం..**



**కోసిగి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు తమ పోరాటం ఆగదని, ఇందుకోసం తాము ప్రాణాలు సైతం ఫణంగా పెడుతామని ఎంఆర్‌పియస్ నియోజక వర్గ ఇంచార్జీ చింతకుంట నాగరాజు, జిల్లా ఎంఎస్‌పి కన్వీనర్ దుర్గప్పలు అన్నారు.. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్ట బద్దత కల్పించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరహా దీక్షలు మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరుకున్నారు.. ఈ నిరహార దీక్షలకు మండలంలోని వికలాంగుల సంఘం సభ్యులు సంఘీభావం తెలిపారు.. వికలాంగులు సైతం దీక్షలలో కూర్చున్నారు.. ఎన్నో ఏళ్లుగా తమ నాయకుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన ఈ పోరాటంలో ఎంతో మంది మాదిగలు ప్రాణాలు కోల్పోయారన్నారు.. అయితే ఈ వర్గీకరణ జరిగే వరకు తమ పోరాటం ఆగదని, ఈ పోరాటంలో తమ ప్రాణాలు ఫణంగా పెట్టి వర్గీకరణ సాధించుకుంటామన్నారు.. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేసారు.. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు చింతకుంట సామేల్, కో కన్వీనర్లు ఈరన్న, ప్రకాష్, చిదానంద, లక్ష్మన్న, రామకృష్ణ, వికలాంగుల సంఘం నాయకులు తాయన్న, తదితరులు పాల్గొన్నారు..

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా భారీ ఎత్తున నిరసనలు



**కర్నూలు న్యూసిటి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కర్నూలు నగరంలో మంగళవారం భారీ ఎత్తున నిరసన దీక్షలు టిఎన్‌టియుసి అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహులు, నగర అధ్యక్షులు పాల్‌రాజు అధ్యత వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జీ టీజి భరత్, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అశోక్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు జేమ్స్, తెలుగు యువత అధ్యక్షులు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా పూజలు అందుకుంటున్న బొజ్జ గణపయ్యలు



**నందికొట్కూరు,సెప్టెంబర్ 19,ప్రభాతవార్త:** వినాయక చవితి పురస్కారించుకొని వాడవాడలా బొజ్జ గణపయ్యలు కొలువుతీరి పూజలు అందుకుంటున్నారు. గురువారం అత్యంత వైభవంగా అలంకరించిన మండపాలలో గణపయ్యలు ఆశీనులయ్యారు. భక్తులు మండపాల వద్దకు చేరుకొని అత్యంత భక్తిశ్రద్దలతో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మాకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కాపాడాలి గణపయ్య అంటూ తమ కోరికలను కోరుకున్నారు. మండపాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో దాదాపు 64 విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై ఎన్.వి.రమణ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు.

## ఘనంగా వినాయకచవితి వేడుకలు



**నందవరం, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** గణపతి నవరాత్రులను పురష్కరించుకొని నందవరం మండలంలోని వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. మండలపాల వద్ద ప్రత్యేక అలంకరణ చేసి మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులు గణనాధుని ప్రతిష్టించారు. మండల కేంద్రమైన నందవరంలో గణేష్‌అసోసియేషన్ వీరశైవ లింగాయతి సభ్యులు భీమలింగేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి, ఆయప్పస్వామి దేవాలయాల దగ్గర, మాచాపురం ఇబ్రహింపురం, నదికైరవాడి, గంగవరం, నాగలదిన్నె పలు గ్రామాల్లో ఏవాడాలో చూసిన గణనాధుడి మండపాలతో కళకలలాడుతున్నాయి. వాడ వాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో వివిధ ప్రత్యేక అకృతుల్లో గణనాధుడి విగ్రహాలు భక్తులను విశేషంగా అకర్షిస్తున్నాయి.ఈవిగ్రహాలను దర్శించుకొని పూజలు నిర్వహించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన మండపాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. తొలిరోజు, రెండవ రోజు పూజా కార్యక్రమాల్లో భక్తులు గణనాధుడికి పూజలు నిష్ట నియమాలతో ఘనంగా నిర్వహించారు.

## విభిన్న ప్రతిభావంతుల పట్ల చిన్నచూపు వద్దు

**-బైరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అంధులకు అన్నదానం**



**నంద్యాల విద్య, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** విభిన్న ప్రతిభావంతుల పట్ల చిన్నచూపు వద్దని వారి ప్రతిభ అధారంగా చదువు, వసతి, ఆర్థికంగా ప్రోత్సహించి సమాజంలో సమానంగా, గౌరవంగా బ్రతికేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు ఎంవి రమణారెడ్డి, ఒడ్డు సంజీవరెడ్డిలు పేర్కొన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకొని మంగళవారం నంద్యాల క్రాంతినగర్‌లో వున్న జీవనజ్యోతి అంధుల పాఠశాలలో అంధ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రాయలసీమలో సాగునీటికి పోరాటం చేసే ఏకైక వీరుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అని ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తు అనునిత్యం ప్రజల్లో ఉండేవ్యక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరాజు, నరసింహాయాదవ్, దేవేంద్రారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అంధుల పాఠశాల నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, వలిబాష,తీనే హౌస్‌రావు, హెచ్ఎం సంజమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన టీడీపీ ఇన్‌చార్జ్ మన్నె సుబ్బారెడ్డి



**బేతంచెర్ల,సెప్టెంబర్19,ప్రభాతవార్త:** పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త ఎన్.శేఖరయ్య తల్లి భాగ్యలక్ష్మి(65) మృతి చెందడంతో డోన్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి మంగళవారం భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆయనతోపాటు కౌన్సిలర్ రామాంజనేయులు,పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పంటపొలాలకు సాగునీరు ఇవ్వాలని మంత్రికి వినతి



**దేవనకొండ,సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** గుండ్లకొండ దగ్గర హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగునీరు ఇవ్వాలని, పంటకాలువలు నిర్మించాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్,రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి,సీనియర్ నాయకులు నారాయణస్వామి,రైతులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ గుండ్లకొండ వద్ద హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి గ్రావిట్ ద్వారా గుండ్లకొండ నుండి కోటకొండ వరకు 12గ్రామాలలో 20వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అవకాశం ఉందని కావున స్లూయిజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదన ప్రభుత్వం దృష్టికి మరియు ఇరిగేషన్ శాఖ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు షాకీర్,అశోక్,,రైతులు జయచంద్ర,తిప్పన్న,మాదాల మార్కండేయులు, కొలుట్లస్వామి,భాస్కర్ తదితరులున్నారు.

## వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు



**పత్తికొండ,సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** డివిజన్ కేంద్రమైన పత్తికొండతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక పండుగ సందర్భంగా వాడవాడలా బొజ్జ గణపయ్యలు కొలువుదీరి ప్రత్యేక పూజలందుకుంటున్నారు. పట్టణంలోని శ్రీరామ్ పేట,కళ్ల పెంట వీధి,ఉప్పర కట్ట,కమ్మరగిరి పెద్దమ్మ గుడి దగ్గర,ఊరువాకిలి దగ్గర,చౌడమ్మ గుడి దగ్గర వినాయకులు కొలువుదీరారు. సత్య యూత్,పత్తికొండ మండల అధ్యక్షులు నారాయణదాస్, శరత్,రమణ,సుధాకర్,ఈశ్వర్,గోవిందు,వీరేష్, నాగరాజులు పట్టణంలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకుపూజ, కుంకుమార్చన,మహామంగళారతి తదితర పూజలు చేశారు. వినాయకుల దగ్గర దర్శనం కోసం భక్తాదులు వచ్చి నైవేద్యం,కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలో వివిధ రకాల వేషాధారణలో ఉన్న వినాయక విగ్రహాలను తిలకించేందుకు ప్రజలకు భారీగా తరలివచ్చారు. వినాయక మండపాల వద్ద అన్నదానం,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఘనంగా స్వాతివేడుకలు



**బనగానపల్లెరూరల్,సెప్టెంబర్19,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణ శివార్లలో గల రవ్వలకొండ మీద వెలసిన శ్రీ చెంచులక్ష్మి పావన సమేత పావన నరసింహస్వామి దేవస్థానం నందు మంగళవారం స్వాతినక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్వాతివేడుకల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు,కుంకుమార్చనలు,అభిషేకాలు మరియు ఎక్కడ జరిగిన విధంగా ఆకుపూజలు నిర్వహించారు.స్వాతివేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కైంకర్యాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం మధ్యాహ్నం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకులు,ఆలయ ప్రధాన అర్చకుడు బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్బంగా బాలిశెట్టి పావన నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఆలయం నందు పేద,ధనికులు అనే తేడా లేకుండా వారి పెళ్లిళ్ళ,నిశ్చితార్థాలు,పుట్టెంటుకలు మొదలైనవి ఉచితంగా చేసుకోవచ్చునని నరసింహమూర్తి తెలియజేశారు.వంటకు కావాల్సిన వస్తువులను కూడా ఉచితంగా అందజేస్తామని ఆయన తెలిపారు.

## ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై 4 ఆవులు మృతి



**వెల్దుర్తి,సెప్టెంబర్19,ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై 4 ఆవులు మృతిచెందిన సంఘటన మంగళవారం బ్రహ్మగుండం సమీపంలోని ఎర్రచెరువు వద్ద చోటుచేసుకుంది.వివరాలలోకి వెళితే మండలంలోని రత్నాపల్లి గ్రామానికి చెందిన ఆవులను రామక్రిష్ణ మేపుకుంటూ బ్రహ్మగుండం వద్ద గల ఎర్రచెరువు ప్రాంతానికి చేరుకున్నాడు.అయితే ఆవుల మందలోని 4 ఆవులు గుంతలో ఉన్న నీటిని త్రాగేందుకు వెళ్లాయి.ఆ సమయంలో అక్కడ 11 కెవి విద్యుత్‌లైన్ తీగలు వేలాడుతున్నది గమనించని ఆవులు అటుగా వెళ్లాయి.దీంతో ప్రమాదవశాత్తు ఆ ఆవులకు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి.ఈ విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఇ రాఘవేంద్రప్రసాద్ లైన్‌ఇన్‌స్పెక్టర్ మద్దయ్యను పంపి కరెంటు తీయించారు.పరిస్థితిని సమీక్షించారు.ప్రమాదవశాత్తు ఈ ఆవులు ఇలా మృతిచెందడం బాధాకరమన్నారు.ఇదే విషయాన్ని పశువైద్యాధికారిణి డాక్టర్.శాంతలతకు తెలిపారు.ఆమె సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించారు.విద్యుత్‌షాక్‌కు గురైన చనిపోయిన ఆవులలో రత్నాపల్లికి చెందిన చాకలి రామక్రిష్ణవి 2,చాకలి సుధాకర్‌వి ఒకటి,చాకలి యల్లస్వామిది ఒకటిగా ఉన్నాయి.వీటి విలువ దాదాపుగా రూ.2లక్షలు ఉంటుందని రైతులు అన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక వినాయకుడు



**మిడుతూరు, సెప్టెంబర్19, ప్రభాతవార్త ;** మిడుతూరు మండలంలో వినాయక చవితి సందర్భంగా దాదాపు 42 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాల ఏర్పాటు చేసిన రోజు నుంచి ప్రతిరోజు భక్తులు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిచోట పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో ఈ వినాయక ఉత్సవాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇది ఇలా ఉండగా మండలకేంద్రమైన మిడుతూరులోని బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అది ఏమంటే మత సామరస్యానికి ప్రత్యేకంగా దూదేకుల సామాజిక వర్గానికి చెందిన యువకులు అందరితో కలిసి మమేకమై ఎంతో భక్తిశ్రద్ధలతో క్రమశిక్షణతో వినాయక విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకు గ్రామపెద్దలు, పలువురు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా బన్నూరు చంద్రారెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, బన్నూరు రాములరెడ్డి, రంగస్వామి, జమాల్, మన్సూర్, కార్తీక్, సలాం, వంశీ, షేక్షావలి, సాదిక్, రంజిత్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## ఘనంగా పూజలందుకుంటున్న గణేషుడు



**ఉయ్యాలవాడ,సెప్టెంబర్19,ప్రభాతవార్త:** మండల పరిధిలో ఉన్నటువంటి అన్ని గ్రామాల్లో యువత ఎక్కుగా గణేష్ విగ్రహాలను కొలువు ఉంచడం జరిగింది.రెండు రోజులు ముందు నుంచే గణేష్ మండపాలను రంగు రంగు కాగితాలతో డెకరేషన్ లైట్లతో చాలా అందంగా తయారుచేసి అందులో విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రధాన అర్చకులచే పూజలను జరిపించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు తంబల్ల నరసింహయ్య మాట్లాడుతూ హిందువులు మొదటి ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా విఘ్నలు,ఆటంకాలు లేకుండా కొనసాగాలని తొలి పూజ గణేషుడికే చేస్తారన్నారు.పార్వతి తనయుడి అనుగ్రహం పొందితే అన్ని కార్యాలు జయప్రదం అవుతాయని ప్రగాఢ నమ్మకం.భాదప్రద శుక్లపక్ష చవితి రోజే వినాయకుడి జననం జరిగిందని అందుకునే గణాధిపత్యం వచ్చిందని పురాణాలు చెబుతున్నాయని ఆయన అన్నారు.వినాయకుడికి మొదటి పూజను చేయడం వల్ల పనులల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా మంచి జరుగుతుందని భక్తులు ఏమి కోరినా వారి కోర్కెలు నెరవేరుస్తారని భక్తుల నమ్మకం కాబట్టి ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ నిర్వాహకులు యువనాయకుడు సిద్దార్థరెడ్డి,వరశివారెడ్డి,గాండ్ల సుబ్రహ్మణ్యం,అన్నెం భార్గవ,మనోహర్,గగనసింధూ,హఫీజ్ పాల్గొనడం జరిగింది.

## చట్టబద్ధతకై పోరాడుదాం..



**ఆస్పరి,సెప్టెంబరు 19,ప్రభాతవార్త :** ఏబిసిడి వర్గీకరణ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శించి మాదిగలను విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు సంజప్ప మాదిగ,మండల కన్వినర్ రామాంజనేయులు,మండల ఇంచార్జ చిన్న సంజన్న మాదిగలు హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆస్పరి పట్టణం నందు ఎస్‌సి వర్గీకరణకు పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్దత కల్పించాలని కోరుతూ మంగళవారం మాదిగల నిరసన దీక్షలను 7వ రోజు ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ చిన్న సంజన్న మాదిగ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల చిరకాల కోరిక ఏబిసిడి వర్గాకరణ సాధించేవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పార్లమెంట్‌లో చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్ష కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చిరుమాన్‌దొడ్డి గ్రామనాయకులు హనుమంతు,కార్తీక్,రామాంజనేయ,పులి కర్ణాకర్,లక్ష్మన్నలు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హనుమంతు,ఎమ్మార్పీఎస్ యువసేన నాయకులు పూజారి శ్రీనివాసులు మాదిగ,యోగేష్ మాదిగ,నాయకులు కోదండరాముడు,రామలింగడు, బాబు,శ్రీరాములు,రామంజనీ,థామస్,టైలర్ నాగేంద్ర,చక్రాల శీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభకు భారీగా..

## తరలివెళ్లిన మహిళలు రైతులు

**బేతంచెర్ల,సెప్టెంబర్19,ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన డోన్‌లో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు



మండలంలోని వైసీపీ నాయకులు,కార్యకర్తలతోపాటు పొదుపు మహిళలు,రైతులు,కార్మికులు మంగళవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు.మండలంలోని వివిధ గ్రామాలతోపాటు బేతంచెర్ల పట్టణం నుండి వేలాది మంది మహిళలు దాదాపు 210 బస్సులల్లో తరలివెళ్లడం జరిగింది.అలాగే వివిధ వర్గాలకు చెందిన నాయకులు,రైతులు సొంత వాహనాల్లోను తరలివెళ్లారు.

# ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సిఎం జగన్



- క్రిష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద రూ.253.72 కోట్ల రుపాయలతో చేపట్టిన ఎత్తిపోతల పథకం ప్రారంభం...
- ఈ పథకం ద్వార 77 చెరువులకు నీటిని నింపే పంప్ హౌస్‌ను ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కరువు నేలకు జలాభిషేకం...

**క్రిష్ణగిరి, సెప్టెంబర్19, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద రూ.253.72 కోట్ల రుపాయలతో చేపట్టిన ఎత్తిపోతల పథకం ద్వార 77 చెరువులకు నీటిని నింపే పంప్ హౌస్‌ను మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో కరువు నేలకు జలాభిషేకం చేసినట్లయ్యింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్. సంజీవ్‌కుమార్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి, జిల్లాపరిషత్ చైర్మెన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, జిల్లాకలెక్టర్ జి. సృజన, జిల్లా ఎస్పీ జి. క్రిష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, వ్యవసాయ సలహామండలి చైర్మెన్ బెల్లం మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపి బుట్టా రేణుక, క్రిష్ణగిరి ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పథకం ద్వార కర్నూలు-నంద్యాల జిల్లాల పశ్చిమ ప్రాంత 77 చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుండి10363 ఎకరాల ఆయకట్టు సాగు కానుంది. డోన్ నియోజకవర్గానికి సంబంధించి డోన్ మండలంలో 17 చెరువులకు, ప్యాపిలి మండలంలో 19 చెరువులకు, పత్తికొండ నియోవజకవర్గానికి సంబంధించి క్రిష్ణగిరి మండలంలో 4 చెరువులకు, వెల్దుర్తి మండలంలో 13 చెరువులకు, పత్తికొండ మండలంలో 3 చెరువులకు, తుగ్గలి మండలంలో 14 చెరువులకు, మద్దికెర మండలంలో2 చెరువులకు, ఆలూరు నియోజకవర్గంలో దేవనకొండ మండలంలో 3 చెరువులకు, పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు మండలంలో 2 చెరువులకు ఆయకట్టు సాగునీరు అందనుంది. ముందుగా పంప్‌హౌస్ ప్రవేశ ద్వారం వద్ద కర్నూలు నంద్యాల జిల్లాల పశ్చిమ ప్రాంత 77 చెరువులకు హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ నుండి సాగు, త్రాగునీరు అందించే పథకానికి సంబంధించిన పైలాన్‌ను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్, మ్యాప్‌ను సిఎం పరిశీలించారు. ఈ ప్రాజెక్టు గురించి జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సిఎంకు వివరించారు. అనంతరం నీటిని విడుదలకు సంబంధించి ప్యానెల్ బోర్డును సిఎం స్విచ్చాన్ చేశారు. నీటి వివరాలను జలవనరులశాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ సి. నారాయణరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రెడ్డి శేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు.



- ప్రజలకు, అభిమానులకు నవ్వుతూ, నమస్కారం చేస్తూ ముందుకు కదిలిన సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి...

ముందుగా క్రిష్ణగిరి మండలం ఆలంకొండ హెలిప్యాడ్ వద్దకు సిఎం హెలికాప్టర్‌లో ఉదయం 10-45 గంటలకు చేరుకున్నారు. హెలికాప్టర్‌లో నుంచి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగగానే పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి, రాష్ట్ర వైకాపా కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డిలు సిఎంకు పూలబోకే అందించి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వార ఉదయం 10.56 నిమిషాలకు ఆలంకొండ పంప్‌హౌస్ వేదిక స్థలానికి ముఖ్యమంత్రి చేరుకోగానే పత్తికొండ నియోజకవర్గ చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన ప్రజలు ముఖ్యమంత్రిని చూడగానే ఉత్సాహంతో నినాదాలు చేశారు. తనను చూసేందుకు వచ్చిన ప్రజలకు, అభిమానులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవ్వుతూ నమస్కరించి, ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం డోన్‌లో ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు.

## చంద్రబాబు అరెస్టుతో వైసీపీ పతనం మొదలయింది

-టిడిపి పార్లమెంటు ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి



**నంద్యాల విద్య, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా 7వ రోజు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అధ్వర్యంలో నియోజకవర్గంలోని రైతులందరు మంగళవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. తాలూక అఫీసుకేదురుగా చేపట్టిన నిరాహారదీక్షలో నంద్యాల పార్లమెంటు టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అధ్వర్యంలో నిరాహారదీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుపై జగన్ ప్రభుత్వం మోపిన అక్రమ కేసులు, అరెస్టును తీవ్రంగా ఖండిస్తు కడిగిన ముత్యంగా బయటకు రావాలని వారు అశించారు. మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ ఈసైకో ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. యువత అంతా వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఒడగొట్టి టిడిపి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నంద్యాల పట్టణం టెక్కె నాగులకట్ట అంజనేయస్వామి దేవాలయం నందు చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి 108 టెంకాయలు సమర్పించి విఘ్నేశ్వరునికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణ టిడిపి కౌన్సిలర్ జైనాబి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించి పట్టణంలోని ప్రతి టిడిపి కార్యకర్త పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తేళ్ళపూరి టిడిపి నాయకులు కాటంరెడ్డి తులశీశ్వర్‌రెడ్డి, రాయపాడు, తేళ్లపూరి, మిట్నాల, గోస్పాడు, యాళ్లూరు గ్రామ రైతులు పాల్గొన్నారు. మాండ్ర శివానందరెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

## రామాలయంలో ఈక్షుదండ వేడుకలు



**నంద్యాల టెక్కె, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలోని సంజీవ నగర్ రామాలయంలో ఈక్షుదండ మహాగణపతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ భగవత్ సేవా సమాజ్ నిర్వాహకులు సముద్రాల సూరయ్య, వంకదార మధుసూదన్‌రావు, మాఘం గురుప్రసాద్, దేవరశెట్టి శ్రీనివాసులు అధ్వర్యంలో విక్షుదండ మహాగణపతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెరుకుగడ తో వినాయక స్వరూపం, తామరగింజలతో తయారైన ముఖవలితో వినాయక స్వామిని అత్యంత అద్వితీయంగా ప్రతిష్టించారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సాయిరాం బాబా, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ చైర్మన్ డా.రవికృష్ణ, రామలింగారెడ్డిలు హాజరయ్యారు. పురప్రముఖులతో హాజరయిన ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసంవత్సరాన్ని పర్యావరణ పరిరక్షణ గణపతిగా 11వ సంవత్సరం ఎంతో అందంగా మహాస్వరూపాలతో తయారు చేసి పుర ప్రజలందరికి దర్శనభాగ్యం కలిగించారు. ఈనెల 22 వరకు ఉదయం సాయంత్రం భక్తులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సి.యం.కు పుష్పగుచ్చంతో స్వాగతం పలికిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా డోన్, పాణ్యం, ఆలూరు, పత్తికొండలోని 77 చెరువులకు సాగు త్రాగు నీటిని వదిలేందుకు డోన్ నియోజకవర్గానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్. జగన్‌మోహన్‌రెడ్డికి నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. మంగళవారం నంద్యాల జిల్లాకు వచ్చిన సి. యం.కు ఓర్వకల్లు విమానాశ్రయం వద్ద ఎమ్మెల్యే కలిసి స్వాగతం పలికి నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వివరించినట్లుగా తెలిసింది.

# కన్నుల పండువగా కొలువుదీరిన గణనాధులు...



**కోసిగి, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** "గజముఖం.. ఏకదంతం.. లంబోదరం.. ఇదీ ఆదిదేవుడి భౌతిక రూపం.. తరిచి చూస్తే ఆ రూపం నిజంగా అపు రూపం.. తొండం స్థూల, సూక్ష్మ కర్మల్లో సమన్వ యానికి, చాటల్లాంటి చెవులు విస్తృత జ్ఞాన సేకరణకు, చిన్న కళ్లు సూక్ష్మ దృష్టికి, ధర్మార్థ, కామ, మోక్ష సాధ నకు నాలుగు చేతులు ప్రతీకలుగా నిలిస్తే, కష్టసు ఖాలన్నిటినీ సమపాళ్లలో జీర్ణించుకోవాలని లంబో దరం, అల్పజీవులను అలక్ష్యం చేయరాదని మూషిక వాహనం చెప్పకనే చెబుతున్నాయి.. ఇరు వైపుల ఉన్న సిద్ధి, బుద్ధి, విఘ్నేశ్వరుడిని కార్యసాధనకు, జ్ఞానానికి పర్యాపదాలుగా మార్చేసాయి.. సకల విఘ్నాలు తొలగించే ఆదిదేవుడు జిల్లా వ్యాప్తంగా సోమవారం కొలువుదీరాడు.. అందంగా ముస్తాబు చేసిన మంటపాల్లో గణనాధుల విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్దలతో పూజలు చేసారు.. పలుచోట్ల వైవిధ్యంగా ఉండే గణపయ్యలను నిర్వాహకులు ప్రతిష్టించడంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకుంది..

"గంగా సుతుడు..దేవ దేవతలకు ఆరాధ్యుడు గణాధీశ్వరుడు వినాయకుడు..ఏ కార్యం ప్రారంభించినా తొలి పూజ గణనాధునికే. ఆయన అనుగ్రహం పొందితే ఆ కార్యం జయమవుతుంది. సాక్షాత్తు విధాత సైతం సృష్టి ప్రారంభానికి ముందు గణపతిని పూజించినట్లు 'రుగ్వేదం' చెబుతోంది. అలాంటి వినాయకుడి జన్మదినం 'భాద్రపద శుద్ధ చవితి' రోజున జరుపుకునే వినాయక చవితి పండుగను సోమవారం మధ్యాహ్నం నుండి జిల్లా మొత్తం సంబరంగా జరుపుకున్నారు.. ప్రతి వీధిలో వివిధ రూపాల్లోని భారీ విఘ్నేశ్వరుడి ప్రతిమలను ప్రతిష్టించి పూజలు చేసారు. కనులు మిరి మిట్లు గొలిపే రీతిలో తాత్కాలిక మంటపాలు ఏర్పాటు చేసారు. దేదీవ్యమానంగా విద్యుత్ కాంతులతో గణపతి మంటపాలను అలంకరించారు. బై బోలో గణపతి మహరాజుకు జై గణపతి బప్ప మోరియా అంటూ భక్తులు భక్తావేశాలతో ప్రార్ధించారు"..

గ్రామ గ్రామాన ఆధ్యాత్మిక శోభ..పార్వతీనందనుడి రాకతో పులకించిన భక్త జనం..ఆది పూజల దేవుడు.. ఆ బాల గోపాలానికి ఆరాధ్యుడై..భక్త జనకోటిచే కీర్తింపబడుతూ గణనాధుడు వాడవాడలా కొలువుదీరి విశేష పూజలు అందుకుంటున్నాడు.. దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..దయ ఉంచయ్యా దేవా..అంటూ వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో గజకర్ణుడు



కొలువుదీరాడు.. వక్రతుండుడు బహు రూపాల్లో దర్శనమిస్తున్నాడు.. ఎటు చూసినా.. కోలాహలమే.. గౌరీ నందనుడి నామస్మరణతో వాడవాడలూ హోరేత్తిపోతున్నాయి.. విఘ్నాలు తొలగించి..కష్టాల నుంచి తమను గట్టెక్కించాలంటూ ఆ విఘ్నాధిపతిని కోరుకుంటూ వేడుకలను అత్యంత భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు..పల్లె ప్రాంతాలు వినాయక పందిళ్లతో కళ కళలాడాయి.. పోటీలు పడి మరీ భారీ విగ్రహాలను వీధుల్లో ఏర్పాటు చేసి పూజలు చేసారు..ఒకవైపు భక్తి పారవశ్యం..ఇంకొక వైపు వినాయక భక్తుల్లో హర్షం..ఈ రెండింటి మధ్య గణనాధుడు మూషిక వాహనంపై ప్రతిష్టింపబడ్డాడు..తాము చేసే ప్రతి శుభకార్యాలకు ఏలాంటి విఘ్నాలు(ఆటంకాలు) కలుగరాదని, అంతా మంచి జరగాలని భక్తులు వేడుకున్నారు.."గణపతి బొప్ప మోరియా"అంటూ అత్యంత భక్తి శ్రద్దలతో భజనలు చేసారు. ఈ సందర్భంగా యువక మండలి సభ్యులు ఊరంతా వేడుకలు చేసుకున్నారు..

## వినాయక చవితి వేడుకల్లో అపశృతి



మంత్రాలయం, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త: నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో వినాయక చవితి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. ఈ వేడుకల్లో విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మంత్రాలయం ఎస్ఐ వేణు గోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు మంత్రాలయంలోని రాఘవేంద్రపురంకు చెందిన కంసాలి నారయణ, కాశమ్మ దంపతుల మూడవ కుమారుడు పవన్(28) వినాయక మండపం వద్ద విద్యుత్‌కు సంబంధించిన పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు యువకుడు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనున్న వారు గమనించేలోపు యువకుడు మృతి చెందినట్లు తెలుసుకున్నారు. యువకుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గణేషుడికి తొలి పూజలు

- అన్ని కులాలు కలిసి చేసుకునే పండుగ వినాయక చవితి - ఎమ్మెల్యే



**అవుకు, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** అవుకు పట్టణంలోని ముస్లిం వీధిలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా తొలి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైసీపీ ప్రధాన కార్యదర్శి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, అవుకు మండల ఎంపిపి చల్లా రాజశేఖర్‌రెడ్డి, అవుకు పట్టణ ఉపసర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ చల్లా భాస్కర్‌రెడ్డి, వైసీపీ ముఖ్యనాయకులు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలల్లో అన్ని కులాల ప్రజలు వినాయక చవితి పండుగను కలిసిమెలసి చేసుకుంటారని ఆయన తెలియజేశారు. వినాయక చవితి పండుగ ఐక్యమత్యానికి నిదర్శనమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రధాన కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, మల్లెల సునీల్, మేడం ఆంజనేయులు, మెట్టుపల్లె వీరారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మండల గ్రామ సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, నాగరాజు, కొవ్వూరు మద్దయ్య, సోషల్ మీడియా సూరి, చౌదయ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కలెక్టరు కార్యాలయంలో,, పరిపాలన గణపతి



**కర్నూలు విద్య, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** వినాయక చవితిని పురష్కరించుకొని కర్నూలు నగరలో అత్యంత భక్తిశ్రద్దలతో గణేష్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కలెక్టరు కార్యాలయంలో పరిపాలన గణపతికి జిల్లా కలెక్టరు డా.జి సృజనా పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం శ్రీ గణేష్‌మహోత్సవ కేంద్ర సమితి సావనీర్‌ను అవిష్కరించారు. ఈకార్యక్రమంలో డిఆర్వో, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షులు కృష్ణ, నగర గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వర్, జిల్లా గణేష్ మహోత్సవ సమితి సభ్యులు సందడి సుధాకర్, కాళింగి నరసింహ వర్మ, నాగపాణి శాస్త్రి, వేణుగోపాల్, రంగస్వామి, హరిష్‌బాబు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి కార్యాలయంలో శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యుల చేత పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులందరు పాల్గొన్నారు.

## మహిళలంతా కలిసి జగన్‌ను ఇంటికి పంపండి..!



**ఆదోని, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** మహిళలంతా కలిసి జగన్‌ను ఇంటికి పంపాలని అబ్బర్వర్ గాజుల ఆదెన్న, తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడులు అన్నారు. తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు ఆద్వర్యంలో మంగళవారం తెలుగు మహిళలు మేముసైతం అంటూ రిలే నిరాహార దీక్షలకు కూర్చున్నారు. ఈ సందర్భంగా అబ్బర్వర్ గాజుల ఆదెన్న మాట్లాడుతూ అభివృద్ధి చేయలేక, ప్రజలలోకి పోవడానికి కూడా చేతకాని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న రోజుల్లో తెదేపా అధికారంలోకి వస్తుందనే కక్ష్యతోనే అక్రమ కేసులు పెట్టి అక్రమ అరెస్టు చేయడం తుగ్లక్ పాలనకు నిదర్శనమన్నారు. నేడు మహిళలు కూడా చంద్రబాబుకు మద్దతుగా బయటకి వచ్చి దీక్షలు చేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి ఖచ్చితంగా ఇంటికి పోతారన్నారు. ఈ దీక్షకు ఆదోని నియోజకవర్గ మహిళలు పెద్దఎత్తున పాల్గొని ఎన్‌టిఆర్ విగ్రహం నుండి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు 200అడుగుల నల్లజెండాను మోసుకుని భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. మహిళలు మాట్లాడుతూ బాబు అంటే గుర్తొచ్చేది ఐటి అని..జగన్ అంటే గుర్తొచ్చేది లూటీ..అని అన్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో దొడ్డనగేరి సర్పంచ్ పార్వతమ్మ, మహిళలు విజయలక్ష్మి, రమిజా, అంజుగాంధీ, రాజేశ్వరి, నూర్జహాన్, ఉమా మహేశ్వరి, స్వప్న, శ్రీదేవి, అయ్యమ్మలు కూర్చున్నారు. వీరికి మహిళలు ధనలక్ష్మి, నీరజ, సర్వమ్మ, శాంతి, ఈరమ్మ, జ్యోతమ్మ, తెదేపా నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు.

**కక్ష్యసాధింపులో భాగంగానే అక్రమ కేసులు :-** కక్ష్యసాధింపులో భాగంగానే చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని తెదేపా సీనియర్ నాయకులు మదిరె భాస్కర్‌రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సాదీరవూఫ్‌లు అన్నారు. మంగళవారం ఆదోని నియోజకవర్గంలో మరోవర్గం తెదేపా సీనియర్ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 7వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భగవంతుడు చంద్రబాబు కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించాలని ఆయనకు ఎలాంటి అవినీతి మచ్చ లేకుండ బయటకు రావాలని ఆకాంక్షించారు. తెదేపా నాయకులు సాంబగల్ ఫక్రుద్దీన్, సోమశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రామచంద్ర, మల్లికార్జున, శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, మద్దికెర రామకృష్ణ, మైనార్టీ ఎండి హుస్సేన్, నారాయణపురం షాషావలి, ఇస్మాయిల్, రాముడు, సలకలకొండ రామకృష్ణ, రమేష్, తిమ్మప్ప, పరమేష్, శేఖన్న, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం - బుడ్డా శేషిరెడ్డి

: నియోజకవర్గంలో త్వరలోనే కీలకమైన రాజకీయాలు

: జిల్లా పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు

: బుడ్డా శేషిరెడ్డి అనుచర వర్గానికి నియోజకవర్గంలో ఉత్సహం



**ఆత్మకూరు సెప్టెంబర్19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని శ్రీశైలం నియోజకవర్గం వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల జిల్లాలోని డోన్‌లో జరిగే పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బుడ్డా శేషిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అతి త్వరలోనే కీలకమైన రాజకీయాలు కొనసాగించే విదంగా కార్యచరణ సిద్దంగా చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలవడంతో శ్రీశైలం నియోజకవర్గంలో బుడ్డా శేషిరెడ్డి అనుచర వర్గానికి ఎన్నలేని ఉత్సహంను నింపింది. 2024 ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం నుంచి బుడ్డా శేషిరెడ్డి వైసిపి పార్టీ అదిష్టానం నుంచి టికెట్ అవకాశం ఇస్తే పోటీసి సిద్దంగా ఉన్నామని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ నవరత్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలో ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి మరో 20ఏళ్ళ వరకు వైసిపికి తిరుగులేదన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో త్వరలోనే కీలకమైన రాజకీయాలపై బుడ్డా శేషిరెడ్డి తన అనుచర వర్గంతో సమావేశాలు నిర్వహించి భారీ స్థాయిలో రాజకీయ సమీకరణలు వైసిపి పార్టీలో కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ తెలుగు యువత రిలే నిరాహార దీక్షలు



**బనగానపల్లెరూరల్, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ మంగళవారం బనగానపల్లె పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుయువత ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు సామూహిక రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎలాంటి అవినీతికి పాల్పడకపోయిన కేవలం కక్షపూరి తంగానే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారని వారు ఆరోపించారు. వెంటనే చంద్రబాబు నాయుడిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం దీక్షల్లో పాల్గొన్న తెలుగుయువత సభ్యులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి, రాష్ట్ర థాయ్ బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి, బీసీ రామనాథరెడ్డి, రాయలసీమ సలాం, ఎస్సీ సెల్ కృష్ణనాయక్, టిప్‌టాప్ కలాం, వెల్‌కం ఫోటోస్టూడియో అల్తాఫ్ తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ దీక్షల్లో బొబ్బల గోపాల్‌రెడ్డి, ఎర్రబోలు పవన్‌కుమార్‌రెడ్డి, అభిరుచి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ టీడీపీ శ్రేణుల రిలే నిరాహార దీక్షలు



**బేతంచెర్ల, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్, రిమాండ్‌ను నిరసిస్తూ స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం మండల కన్వీనర్ యల్ల నాగయ్యతో కలిసి టీడీపీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. డోన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, మాజీ జెడ్పిటీసీ బుగ్గన ప్రసన్నలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వరరెడ్డిలతోపాటు పలువురు టీడీపీ నాయకులు, జనసేన సైనికులు శ్రీకంటి మధు, చల్లా మద్దిలేటిస్వామిలు వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా నారా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా కేసుల నుంచి బయటపడతారని టీడీపీ విజయాన్ని ఎవరు అడ్డుకోలేర న్నారు. సాయంకాలం ధర్మవరం సుబ్బారెడ్డితోపాటు డోన్ నియోజకవర్గ బీసీఎల్ అధ్య క్షులు ఎర్రమలనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, చలివేంద్రం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి వలచల రామకృష్ణ, మాజీ ఎంపిటిసి జాకీరుల్లాబేగ్ తదితరులు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. దీక్షల్లో ఉన్నం సుధాకర్, కౌన్సిలర్లు రామగోపాల్, రామాంజనేయులు, ఫయాజ్, రామకృష్ణ, లక్ష్మన్న, వెంకటేశ్వరగౌడ్, టైలర్ రాముడు, ఆవుల రామకృష్ణ, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయకుడి అనుగ్రహము ఉంటే సకలసౌబాగ్యాలు ప్రాప్తి



**కోవెలకుంట్ల, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** హిందుదర్మశాస్త్ర కారము ఎంత మంది దేవుళ్లు ఉన్నా ఏ పూజలోనైనా ముందుకుగా పూజలు చేసేది వినాయకుడికే అందుకే అ వినాయకుడి అనుగ్రహము ఉంటే సకల సౌబాగ్యాలు ప్రాప్తిస్తాయిన బిసి ఇందిరమ్మ అన్నారు. వినాయన చవితి పండుగను పురస్కరించుకుని వాడ వాడ బారీ విగ్రహాలను పట్టణములో ప్రతిష్టించారు అందులో బాగంగ అర్టిసి బస్టాండు వద్ద ఏర్పాటు తెలుగు దేశం పార్టి యస్‌టి సెల్ యువ నాయకుడు పెనుగొండ రాజశేఖరు నేతృత్వంలో ప్రతిష్టించి విగ్రహము వద్ద ఏర్పాటు చేసిన హోమంలో మంగళవారము మద్యహ్నము బిసి ఇందిరమ్మ పాల్గొన్నారు ఈసందర్బముగా అమె మాట్లాడుతూ అవినాయకుడి అనుగ్రహము కోవెలకుంట్ల పట్టణ ప్రజలందర్కిఇ కలుగాలని వేడుకున్నారు.